# "భ్రమ"

సీతే కోరి దీక్షితుల్ని వీణావాయిద్యం నేర్పడానికి గురువుగా స్వీకరించింది. * * *

ప్రక్కగదిలో శివరావు వాలుకుర్చీలో కూచొని పేపరు చదువుకుంటున్నాడు. ప్రక్కగదిలోంచి వీణ శ్రుతికి సరిపెట్టుకుంటూన్నట్టు, అతనికి వినిపించింది. వెంటనే పేపరు కుడిచేతిప్రక్కనున్న స్టూల్ మీద విసిరి ఒక్కమారు ఒళ్ళువిరుచుకొని పాటవినడానికి సావకాశంగా కుర్చీకిచేరబడి కూచున్నాడు. ఇంతలో చైతన్యంలేని బ్రౌదు ఉక్కుతీగల్లోంచి మనోహరంగా "విడెమూ సేయావే" అన్న త్యాగయ్యకృతిని ఒక్కసారి ఉబికించింది. జీవంలేని మొరకుకఱ్ఱ ఇంత సుకుమారంగా పాడుతుందా! సీతే యిలాగ పాడుతూందేమో అనుకున్నాడు తనముందు సిగ్గుచేత సీత బాగా పాడలేదని శివరావుకి తెలుసును. ఇంతలో ఒండొకటి మిళితమై రెండు సన్ననిస్వరాలు 'విడెమూ సేయావే' అంటున్నాయి. ఆ రెండుపాటలకూ దీక్షితులు లయ వేస్తూన్నట్టు చిరుచప్పట్లు వినిపిస్తున్నాయి. శివరావు శ్రద్ధగా కూచున్నాడు. పాట స్పష్టంగా అర్థమవుతూంది. పువ్వులతోటలో పిల్లవాయువును కౌగలించుకొన్న పుష్పసౌరభంలాగ, సీతకంఠస్వరం వీణలో కలిసిపోయి గదిలోంచి పైకొస్తూంది. శివరావు తలతిప్పుతూ కాలి స్లిప్పరుతో లయవేస్తున్నాడు. ఆపాట అతనిచెవిలో రింగుమంటూంది. ఒకప్పుడు శరీరమంతా చెవిచేసుకొని వింటున్నాడు. సీతకంఠస్వరంలో వీణ యెలాగ లీనమైపోయిందో శివరావుయొక్క హృదయం పాటలోఅలాగ లీనమయిపోయింది. కళ్ళుమూసుకొని కుర్చీకి చేరబడి వింటున్నాడు...హటాత్తుగా పాట ఆగిపోయింది.

ఇంకా పాడవలసిన చరణాలున్నాయని శివరావుకి తెలుసును. ఎందుకిలాగ సగంలో నిలిపేసిందా? అని ఆశ్చర్యపడ్డాడు. దిగ్గునలేచి ఓరవాకిలిగా వేసిన ప్రక్కగది తలుపుతోసి లోపలికి చూచేడు. దీక్షితులు ఒకచేత్తో సీతఎడంచెయ్యి పట్టుకొని యింకోచేత్తో ఆమె చేతివేళ్ళు తనపెదవులదగ్గిర పెట్టుకొంటూన్నట్టు శివరావుకి కనిపించింది. కళ్ళుమూసుకొని గిఱ్ఱునతిరిగి రోడ్డుమీదకురికి వెఱ్ఱెత్తినట్టు పరిగెత్తడం ప్రారంభించేడు శివరావు. తీగలుతెగిన వీణ ఆమెప్రక్క దొర్లుతూంది. ఆమెకట్టుకున్న తెల్లటిచీరమీద రక్తపు చినుకులు కెంపురవ్వల మోస్తరుగా మెరుస్తున్నాయి.

"అమ్మో! వేలికింత పలాస్త్రీయేనా పెట్టండి" అని దీక్షితులు లేచిపోయేడు.

"వీణతీగలు తెగి ఎంతపని చేసేయండీ!" అంది సీత.

—మల్లాది వేంకటకృష్ణశర్మ.

# నిరీక్షణము

అబ్బా! నేను వారి నిరీక్షణమున విలపించి గడపిన ఆ ఘడియలుగూడ ఎంత అభాగ్యమైనవి!! ఆ ఘడియలు ఆశనుగొల్పుచుండెను గాని నిరాశనే ఎదుర్కొనుచుండెను! వానిలో మాధుర్యముండెను, గాని రుచిలేదు! ఉల్లాసముండెను, గాని అది వియోగాగ్నిమధ్యమున భస్మీపటలమగుచుండెను! ప్రకాశముండెను, గాని దానిపై నిరాశాఘనము ఆచ్ఛాదితమైయుండెను! ఉన్మాదముండెను, గాని అది మాదకతాశూన్యమైయుండెను! మత్తుండెను, గాని అంపుస్మృతి హీనతలేదు! నా అనురాగమంతయు అర్థరహితముగానే ఉండెను!

అయ్యో! ప్రేమసముద్రమున దావానలము రగుల్కొనెను! మరి నేత్రములో? స్నేహానురాగముల నొలికించు ఆవీక్షణములు నిరాశావేదనమున వెచ్చని కన్నీరు నొలికించుచుండెను! ఆ చూపులు—నిట్టూర్పులు, వ్యథాట్టహాసమును, సంతాపమును, దెలుపుచుండెనేగాని ఆశను పురిగొల్పుటలేదు! ఆ నేత్రములు దగ్ధమగుచు కొన్ని చల్లనిరాత్రులను, వెచ్చని పగళ్ళను గాంచినవి! కాని భాగ్యముపండలేదు! ఆ కోమలాక్షి విలపించి అలసిసొలసి డస్సినప్పుడు, నిరీక్షించి నిరీక్షించి పరాజయమొందినప్పుడు, తాను దగ్ధమగుచున్న తన జీవనమును నిరీక్షణసమాధిపై, దర్శనసాధనముపై, రూపుమాపివైచినప్పుడు, తుదకు దర్శనమబ్బెను!!

—ద్రోణంరాజు నరశింహారావు.